# కావులా గెద్దలా

"నమస్కారం మేస్టారూ...."

"ఏంరా అప్పలనాయుడూ....ఏంటిలాగొచ్చేవ్? ఏంటి చేస్తున్నావ్" అనడిగేడు.

"బావింకా ఏవీ చేయడం నేదండీ....పన్దొరకనేదు.... రైల్వేలో మా మేనమావ పన్జేస్తున్నాడండి. కూలీగా ఏయించేస్తానోరే, నువ్ సదుంకున్న బల్లో కెల్లి ఐదో కళాసుదాకా సదుకుంటున్నట్టు సట్రిఫికేట్టొట్టుకు రమ్మండు బావూ; అదుంటే కూల్దొరుకుద్దంట కళాసీగా"

"ఏంటి నువ్వు మూడో క్లాసుతో ఆపేసినట్టున్నావు. పైగా ఎప్పుడో చాన్నాళ్ళయినట్టుగుందే నువ్వు చదివి అః!" అన్నాడు దీర్ఘాలోచనలో మునిగినట్టుగా ఫోజు పెట్టా రంగనాథం.

"ఏదో మీ పేరు చెప్పుకొని నాల్రాళ్ళు సంపాయించుకుంకుంటాను బావూ, తిండానిగ్గింజల్లేక సస్తన్నాం. ఏదో మీ సట్రిఫికెట్టుతోనన్నా ఒస్తే దీపం ఎలిగించుకోని మిమ్మల్నే తలస్తాం మా పిల్లాద్దీను" అన్నాడప్పలనాయుడు ఏదో చెప్పరానిదీ చెప్పకూడనిదీ చెప్పవలసొచ్చినట్టుగా.

"సర్దేవోయ్, నీ కష్టం నాకు తెలుసు. మరి నా కష్టం నీకు తెల్సునా? అన్నాళ్ళ రికార్డులూ పైకి తియ్యాలి. వెదకాలి మరి. అయిదో క్లాసు చదివినట్టుగా ఇమ్మంటున్నావు. అధికార్లెవ రైనా అడిగితే సమాధానం చెప్పుకోవాలికదా. మరి నావెంత కష్టమో ఆలోచించేవా?" అని తన 'కష్టం' గురించి పదే పదే చెప్పి "కష్టం ఉంచుకోకు సుమా" అని హెచ్చరించేడు రంగ నాథం.

"బాబ్మలాంటోళ వేంటిచ్చి మీ కష్టం తీర్చగలం. అంత గంటన్నారు గనక ఏదో కూలీ దొరుకుతే మిమ్మల్ని మర్చిపో కండా సంతోసంకొద్దీ ఏదన్నా ఇచ్చుకుంటం బాపూ" నమ్మ కంగా చెప్పేడు అప్పల్నాయుడు.

"సంతికి చీటీ లచ్చిగ్గాజులూనూ. బాగా చెప్పేవ్. అవసరంకొద్దీ ఇవాళ నువ్వొచ్చేవుగానీ ఇన్నాళ్ళూ ఎప్పుడన్నా ఒచ్చేవా? రాలేదు కదా? మరింక అవసరం తీరేక నువ్వొస్తావా? రావు కదా! మనకేదన్నా జబ్బు చేస్తేనే కదా డాక్టర్ని చూసేది. కష్టవొస్తే కదా దేవుణ్ణి తలిచేది. మరింకవి తీరేక వెనక్కి చూస్తావట్రా" అన్నాడు రంగనాథం కుర్చీకి చేరబడిపోతూ. మరింకిస్తేనేగాని ఈ జీవి లేవదన్నట్టుగా.

రంగనాథం మేస్టరుగిరీ ఎలా చేసేడో ఎవరికైనా తెలీ దేమోగాని హెడ్మాస్టరుగా కేవలం నోటితోనే స్కూలు పరిపాలన సాగించేస్తున్నాడన్నది చాలా మందికి తెలుసు. ప్రభుత్వం ఏ

మార్పులు చేసినా తన కనుకూలంగా అప్లయి చేసుకునే నేర్పుంది. డిటెన్షన్లు రద్దు చేస్తే అటెండెన్సు తక్కువైన వాళ్ళకి మెడికల్ సర్టిఫికేట్లు జత చెయ్యటానికి అయిదురూపాయలిచ్చి పెద్ద డాక్టరు దగ్గరకు వెళ్ళడమెందుకు, తానే ఆరెంపీ గాబట్టి రెండ్రూపాయలకే తనే ఇచ్చి తనే అన్నీ చూసుకుంటానంటాడు. ప్రోగ్రెస్ కార్డులు మెయిన్‌టెయిన్ చెయ్యాలని సర్క్యులరొస్తే అచ్చేయించడానికి డబ్బులు వసూలు చేసి మిగుల్చుకుంటాడు. అడ్మిషన్లకీ, విత్‌డ్రాయల్సుకీ తప్పనే తప్పవు. తప్పవని తెలియనివాళ్ళూ తెల్సినా ఇచ్చుకోలేని అప్పల్నాయుళ్ళూ బతిమాలుకోక తప్పదు.

"మేస్టారూ మరలాగంటే మావేం జేస్తావు" అంటూ చేతులు నలుపుకుంటూ నసిగేడప్పల్నాయుడు.

"ఏం జేస్తావూ అంటే నేను మాత్రం ఏం చెప్తాను? హోటేల్లోకెళ్ళి భోంచేద్దావూ అంటే ముద్దకుడువుల్లాగా రెండ్రూపాయలూ అక్కడ పెడితేగాని అన్నం పెట్టడుగదా. పోనీ అదే పాయె. బస్తా బియ్యం కొనుక్కుని ఇంటిల్లిపాదీ తిందాం అంటే తంగున రెండొందలు రాల్చాలా. మానెల్లాళ్ళ జీతవూ ఆబస్తా బియ్యానికే చెల్లయిపోతుంది. మరి నువ్వూ నువ్వూ ఇచ్చింది పాలకే ఇస్తావా? నీళ్ళకే యిస్తావా? అద్దెకే యిస్తావా? పొద్దున్న లేచిందగ్గర్నుండీ పొద్దు పోయి కునికేవరకూ ఏ ఖర్చొచ్చి మీద పడుతుందో బెంగలాగుంటాది. మరలాంటప్పుడు నీ మీదా నీ మీదా కనికారం జూపిస్తే మా కడుపుల్నిండుతయ్యా" అంటూ ఏదో చెప్పుకుపోవడం ప్రారంభించేడు రంగనాథం.

స్వార్థపు రేడియోలో కష్టాల దండకం ఆరున్నొక్క రాగంతో అదేపనిగా ఆలాపిస్తుంటే సన్నకారువాడి సన్నాయి మోతలాంటి పేగుల అరుపులేం పోటీ చేస్తాయి?

"బాబూ! తమరు కోపగించుకోనంటే ఒక్క మాట చెప్తా నాలకించండి. తిన్నదానికి అరిగిందానికి లాభనష్టాలూ జమా కర్చులూ బేరీ జేస్తే ఈ లోకంల బతకనేం బాబూ. గుప్పెడు తిండిగింజలకి తగ్గ పనొక్కటే మాఁవడిగేది. అదొగ్గేసి అటేటో ఒకదాని మీద మరోటి పేర్చేసి సెప్పేత్తున్నారు. మాకేటి బుఱ్ఱ కెక్కుద్ది బావూ. ఏటిచ్చుకోలేని పోజీసన్లో ఉన్నా కూలీ సేసైనా ఇచ్చుకుంటానన్నాను. నమ్మకం వుండాల బావూ నమ్మకం వుండాల. అది నేకపోతే నానేటి సెప్పి నాబవేటి? సెలవు బావూ" అంటూ వెనక్కి తిరగబోయేడప్పల్నాయుడు.

"ఓ రప్పల్నాయుడూ....ఏంటి అంత కోపం....అంత కోపమయితే పనులవ్వవు... సరే....అంతగా అన్నావు కాబట్టి రేపో పర్యాయం కనిపించు" అంటూ రిజిస్టరు ముందుకి లాక్కున్నాడు రంగనాథం మరింక వెళ్ళు అన్నట్టుగా.

ఆ మర్నాడు వెళ్ళేడు అప్పలనాయుడు. ఆ సంవత్సరపు రిజిస్టరు దొరకలేదు. ఆ మర్నాడు మళ్ళీ వెళ్ళేడు. మేస్టారు సెలవు. మూడో నాడు రిజిస్టరు దొరికిందిగానీ అతగాడి పేరందులో కన్పించలేదు. నాల్గోరోజు "మరింక నీ గురించి రిస్కు తీసుకుని, తెగించి ఇచ్చెయ్యాలి సర్టిఫికేటు...మరి ఈ నాల్రోజులూ ఏవన్నా డబ్బులికి ప్రయత్నం చేసేవా? అన్నాడు రంగనాథం.

ఆ నాల్గురోజులూ 'అందుకే టైమిచ్చాడని గ్రహించడానికి అప్పలనాయుడే అవసరంలేదు, నాల్గో క్లాసు కుర్రాడు చాలు.

"చేసేను బాబూ....ఈ నాల్రోజులు తిండానికి లేకపోయినా తిరిగేను బాబూ. తిరగడవే మిగిలింది. సివారికి మా మేనమావకి చెప్తే ఇగో ఈ రూపాయిన్నరా ఇచ్చేడు బావూ" అంటూ నలిగిపోయిన రూపాయి నోటూ, అర్ధరూపాయి బిళ్ళా ఇచ్చేడు అప్పలనాయుడు.

"సరే అదే ఇచ్చి ...మరేం చేస్తాం....ఫలం పుష్పం పత్రం తోయం అన్నారు....గురువు కేవిచ్చినా సంతోషంగా స్వీకరించాలి" అని పుచ్చేసుకుని "ఇదిగో సి సర్టిఫికేటు" అంటూ అందించాడు రంగనాథం.

అప్పలనాయుడు అలా వెళ్ళేడు, మరో ఆయన "అడ్మిషను చేసుకుంటారా మా కుర్రాణ్ణి" అంటూ వచ్చేడు. "దానికేం సంతోషంగా. రెండ్రూపాయలు అడ్మిషనుకి" అంటూ నవిలీసేడు రంగనాథం.

"అడ్మిషను ఫీజా...." అటూ ఇంకేం అనలేదు అవతలివాడు. కేవలం ఆ ఒక్క మాటా అన్నాడు అంతే.

"ఏం బతుకుతాడండీ మేస్టరన్నవాడు. పనిగంటలు పెంచేసేరు. పనిదినాలు పెంచేసేరు. దాంతోపాటు జీతాలు పెంచుతున్నారా? అడక్కూడదండీ ఆ మాట మాత్రం అడక్కూ

డదు. పోనీ తిండి గింజలు శుభ్రంగా ఇన్ని తిందామంటే సరసమైన ధరకి దొరుకుతున్నాయటండీ....కచ్చండీ కచ్చ. మేస్త్రింటే కచ్చ....తీరిగ్గా వుంటాడు. ఏవీ చెప్పడు. ఉత్తినే జీతం ఇస్తున్నామని అందరికీ కచ్చే". ఎదుటివాడి ముఖంలో రంగులూ, కళలూ వాటి మార్పులూ చూడ్డానిక్కాబోలు కాస్త ఆగేడు రంగనాథం. పాపం అతను ఇంకా తేరుకోలేదు.

"అంతెందుకూ....మా స్కూలు కంటింజెన్సీలన్జెప్పి మూడ్రూపాయలు పారేస్తారు. దాంతో ఏం చెయ్యమంటారు చెప్పండి. నెలకు సరిపడ సుద్దముక్కలే కొంటామా? స్కూలు తుడవటానికి చీపురుకట్టలే కొంటామా? తుడిచే మనిషికి కూలే ఇస్తామా? నా సర్వీసు ఇరవయ్యేళ్ళాయి చూస్తున్నాను ఇదే తంతు. ఇదిగో అడ్మిషను ఫారాలు కూడా మేమే కొనుక్కోవాలి. మున్సిఫలాఫీసు సప్లయి లేదు. వందా రెండ్రూపాయలు. ఇలా అడ్మిషను ఫీజంటూ కలెక్ట్ చేద్దామా అంటే....అనువోళ్ళని చూస్తే అట్లాటని టీచర్లని చూస్తే పేరెంట్సు పులులై పోతారండీ.... పిటీషన్లు పెట్టేటానికీ దెబ్బలాట్లకి వచ్చెయ్యడానికీను ...ఏవిటి చెప్తారు మా బతుకులు" అంటూ ఊపిరి తీసుకుని ఎదటివాడు నోరు మూసేసుకున్నాడా, ఇంకా ఏవైనా చెప్పి బ్రెయిన్‌వా చెయ్యాల్సిన అవసరం ఉందా అని చూసేడు రంగనాథం.

ముట్టుకోబోతే కరిచేస్తుంటే ఎవడేవి టంటాడు? అప్పటికీ నోరు విప్పి "అడ్మిషను ఫీజా: మున్సిపల్ స్కూలయ్యుండీ

అడ్మిషను ఫీజు కలెక్టు చేస్తారా? ఎమ్మీఆర్లో వుందా?'' అని కాస్త గట్టిగా అడిగాడు.

"....అన్నీ రూల్సు ప్రకారం జరిగితే బాగానే వుణ్ణండీ. అలా మున్సిపలాఫీసుకు రండి భాగోతం చూపిస్తాను. జీతాలు సరేసరి, ఎడ్యుకేషన్ గ్రాంటు కాదండీ వాళ్ళ జేబుల్లోదిచ్చేస్తున్నట్టే. అడలావుంచండి ఓ పియ్యేఫ్ లోనుకి పెట్టండీ, ఓ అరియర్ బిల్లు పాసవ్వడానికవ్వనీండీ.... బిళ్ళ బంట్రోతు దగ్గరనుండీ పెద్ద బుర్ర వరకూ 'వందకింతా అని రేటూ, బేరవూనూ....మామూలుగా రోటిన్‌లో జరగవలసిన కాయితం కూడా జరగదండి....జరిపించాలి. పోనీ ఈ విషయమై డిపార్టుమెంటు సైడు నుంచి తెప్పించుకుందామా అంటే మా గ్రాంటు ఇచ్చేది వాళ్లే అయినా ఏదీ లక్ష్యమే లేదు. వీళ్ళందరికీ మామూళ్ళివ్వమని ఏదైనా రూలుందటండీ....దాచి పెట్టినట్టు చెయ్యి చాపేస్తారు...." అని గుక్క తీసుకోబోయే సరికి ఏదో మెరుపులా తట్టింది రంగనాథంకి. అంతే గుక్క దిగలేదు. "ఇంతకీ....మీరేంచేస్తుంటారండీ...." అంటూ ఒక్కసారిగా గొంతు తగ్గించి అడిగేడు.

"డిప్యూటీ ఇన్‌స్పెక్టరాఫ్ స్కూల్స్....అర్బన్ రేంజి...." అని అతనూ గుక్క తీసుకుని చెప్పేడు.

"ఆయ. ..తమరనుకోలేదండి .... ఇలా కూర్చోండి...." అంటూ తడబడుతూ లేచిపోయి తన కుర్చీ జరిపేడు "ఆయ....

నర్సింగరావుగారాండీ మీరు ...ఇలా కొత్తగా మీరొచ్చారన్న సంగతెలుసుగానండీ ముఖ పరిచయం లేక....మ్యా...." అంటూ నసిగేడు రంగనాథం.

"ఊఁ" అంటూ గట్టిగా నిట్టూర్పులాంటి మూలుగు మూలిగి కుర్చీ జరిపికదుపుకుని మరీ కూర్చున్నాడాయన. "ఇందాకదేదో చెప్తూ ఆపేసేరు....ఏవిటీ" అంటూ తాపీగా అడిగేడు డియ్యె.

"అబ్బే....మీరని తెలీక....అయినా నేచెప్పిందాంట్లో అబద్ధవే వుందాస్సర్"....అంటూ క్లాసువేపు తిరిగి "ఒరే ఇలారా" అని గట్టిగా పిల్చి...."రావుడి కొట్టుకెళ్ళి....ఓ గోల్డు స్పాట్ తీసుకురారా....ఐస్కూల్డు" అని పంపించేడు.

"ప్చ్....ఇప్పుడవన్నీ వొద్దులెండి....మన సంభాషణలోకి రండి ...నా కుర్రాడి దగ్గర కూడా అడ్మిషను ఫీజు వసూల్చెయ్య డానికి సాహసించేరు కదా, ఫలితం ఎలాగుంటుందో ఏవైనా ఆలోచించేరా? నేను రావడం కేవలం మా అబ్బాయిని చేర్చుద్దా వనే ఒచ్చేను. కానీ....విజిటింగ్ రిమార్కు కూడా రాసే స్తాను...." అంటూ ఆగి...."ఇంతకీ క్లాసెలా వుంది....పాఠాలేం చెపుతున్నట్టు లేదు. మేస్టర్లు జీతాలు, జీవితాలు గురించే వాళ్ళకి కూడా రికార్డులు విన్పిస్తున్నట్టుగా వున్నారు. ఏదీ యశోధర ప్రార్థన వచ్చున్నా....అప్పచెప్పమీ...." అంటూ రంగంలోకి దిగేసేడు డియ్యె.

"ఏట్సార్....యియర్ బిగినింగు కాదా...." అని చెప్ప బోతుంటే...తీరా వాడు లేచి గడగడా అప్పజెప్పేసేడు. "ప్రైవేట్లో ఎన్ని పాఠాలయ్యేయిరా" అనడిగేరు ఇన్స్పెక్టరు గారు నవ్వుతూ. అడిగింది ఇన్స్పెక్టరుగారాయె "పన్నెండండి" అని తక్కున చెప్పేడు.

"అర్బనేరియా కాబట్టి పిల్లే మీకు రక్ష....అయినా మీ సంగతేం బాగోలేదు...." అనే సరికి గోల్డుస్పాట్ బుస్సుమంది. గొంతులో గుఁయ్ గుఁయ్ మని దిగేసరికి డియైగారి చేతులు జేబులో సిగరెట్లు తడమడం, నోరు 'సిగరెట్ట'ని నాన్చడం చూసి "దొరికేవురా మిడతంబొట్లూ" అనుకుని "ఒరేయ్! ఈ సీసా ఇచ్చేసి ఓ సిగరెట్ పెట్టి తీసుకురా...." అంటూ పంపించేడు.

ఇన్స్పెక్షన్ నోట్ బుక్ తీసుకుని రిమార్కు రాయ బోతుంటే 'ఏదో మీకు తెలియందేవుంద్సార్....మేం చిన్న చేప లం...మేం కక్కుర్తి పడేది రూపాయికీ అర్ధకీ...కాకుల్ని కొట్టి గెద్దలకెయ్యడవేన్సార్.. మిగిలేదేవీ వుండదు...'అంటూ నాన్చేడు రంగనాథం.

భయంకరంగా అతనివేపుచూసి, గంభీరంగా పెన్నుతీసి ప్రచండమైన వేగంతో పరపర రిమార్కురాస్తే ఏవో అను కున్నాడు రంగనాథం, చివర్న..."అన్ ద హోల్ ద వర్కింగ్ కండీషనాఫ్ద స్కూలీజ్ సేటిస్ఫేక్టరీ" అని రాసేరు డియై గారు. ★